క్లుప్తంగా

బాధ్యతల స్వీకరణ


తహసీల్దార్ బాలకృష్ణ

కొత్తూరు: స్థానిక తహసీల్దార్‌గా కె.బాలకృష్ణ బుధవారం విధుల్లో చేరారు. హిరమండలం మండలం ఉప తహసీల్దార్‌గా పనిచేసిన బాలకృష్ణను ఉద్యోగోన్నతిపై కొత్తూరు తహసీల్దార్‌గా నియమించారు. ఇంతవరకు ఇక్కడ పనిచేసిన తహసీల్దార్ రవిచంద్రకు విజయవాడకు బదిలీ అయింది. బాలకృష్ణ కొత్తూరు మండలంలో ఉప తహసీల్దార్‌గా గతంలో పనిచేసిన అనుభవం ఉంది.

సివిల్ జడ్జికి ఘనంగా వీడ్కోలు


సివిల్ జడ్జి దంపతులను సత్కరిస్తున్న న్యాయవాదులు

నరసన్నపేట: స్థానిక కోర్టులో జూనియర్ సివిల్ జడ్జిగా మూడేళ్లు పనిచేసిన సి.హెచ్.హరిప్రియ పాలకొండకు బదిలీపై వెళ్తుండటంతో నరసన్నపేట బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆమెకు బుధవారం ఘనంగా వీడ్కోలు పలికారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు రావాడ కొండలరావు, విశ్రాంత జిల్లా జడ్జి పాగోటి మోహన్‌రావు, ఏజీపీ గొండు సత్యనారాయణ, న్యాయవాదులు పాల్గొన్నారు.

అర్హులకు పింఛన్లు మంజూరు చేయాలి

సారవకోట: మండలంలో అర్హులైన వారికి పింఛన్లు మంజూరు చేయాలని ఎంపీడీఓ కార్యాలయంలో ఈఓపీఆర్డీ ప్రభాకర్‌కు జనసేన పార్టీ మండల నాయకుడు బచ్చల పృథ్వి బుధవారం వినతిపత్రం అందించారు. మండల కేంద్రంలో వాన కాంతమ్మ, బచ్చల జయంతితో పాటు మండలంలోని పలు గ్రామాల్లో ఉన్న అర్హులకు సామాజిక పింఛన్లు మంజూరు చేయాలని కోరారు. భర్త పింఛన్‌దారుడై చనిపోతే వెంటనే తొలగిస్తున్నారని, భార్యకు పింఛన్ అందించేందుకు నెలల తరబడి నిరీక్షించాల్సి వస్తోందన్నారు.

104 వాహన సేవలపై ఆరా


రికార్డులను పరిశీలిస్తున్న అధికారులు

నరసన్నపేట: నియోజకవర్గంలోని వివిధ పీహెచ్‌సీల పరిధిలో గ్రామాల్లో వైద్య సేవలు అందజేస్తున్న 104 వాహనాలను అధికారులు బుధవారం పరిశీలించారు. 104 సర్వీసెస్ డీఎం బి.సంతోష్ కుమార్, ఎన్టీఆర్ వైద్య సేవ జిల్లా సమన్వయకర్త పి.ప్రవీణ్, భవ్య హెల్త్ సర్వీస్ ఆడిటర్ వై.బాలరాజు వాహనాల కండిషన్, పరికరాలు ఎలా ఉన్నాయో తనిఖీ చేశారు. మందులు వంటి వివరాలు నమోదు చేసుకున్నారు. 104 సర్వీసులు అరబిందో సంస్థ నిర్వహిస్తుండగా.. కూటమి ప్రభుత్వ 104 సర్వీసులు భవ్య సంస్థకు అప్పగించింది. ప్రస్తుతం వాహనాల స్థితిగతులు, సిబ్బందిపై ఆరా తీస్తున్నామని, ఆడిటింగ్ చేపడుతున్నామని 104 డీఎం సంతోష్ కుమార్ తెలిపారు. ఆపరేషన్ ఎగ్జిక్యూటీవ్‌లు లక్ష్మణరావు, జగదీష్ పాల్గొన్నారు.

నేటి నుంచి అథ్లెటిక్స్‌లో శిక్షణ

బూర్జ: మండలంలోని కె.కె.రాజపురం జెడ్పీ హైస్కూల్‌లో మే 1 నుంచి జూలై 11వ తేదీ వరకు వేసవి అథ్లెటిక్ శిక్షణ తరగతులు నిర్వహించనున్నారు. ఈ మేరకు పాఠశాల హెచ్.ఎం వై.మాలతి బుధవారం ఒక ప్రకటనలో తెలియజేశారు. మండల పరిధిలోని 8 నుంచి 16 ఏళ్ల వయస్సు గల విద్యార్థులు మాత్రమే శిక్షణకు అర్హులన్నారు.

వైభవంగా చందనోత్సవం


లక్ష్మీనరసింహ స్వామి

ఆమదాలవలస రూరల్: ఆమదాలవలస మండలం దివంజీపేటలో గల లక్ష్మీనరసింహ స్వామి ఆలయంలో బుధవారం చందనోత్సవం ఘనంగా జరిగింది. స్వామివారికి ఆలయ అర్చకులు మురపాలక ప్రకాశరావు శర్మ ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

వరి కొయ్యకు నిప్పు..

భూసారానికి ముప్పు

- అన్నదాతకు అవగాహన లోపం
- పెరుగుతున్న చీడపీడలు..
- తగ్గుతున్న దిగుబడులు


పొలంలో వరి కొయ్యలను కాల్చుతున్న రైతు

హిరమండలం:

కొన్నేళ్ల కిందట వరి ఖరీఫ్, రబీ కోతల అనంతరం గడ్డిని కుప్పలుగా వేసి పశువుల మేతకు ఉపయోగించేవారు. ప్రస్తుతం కూలీల కొరత ఏర్పడుతుంటంతో వరి కోతలకు రైతులు యంత్రాలను ఉపయోగిస్తున్నారు. ఇటీవల వరి రబీ కోతలు పూర్తయ్యాక మిగిలిన కొయ్యలతోపాటు మిగిలిన గడ్డికి పొలంలోనే నిప్పంటిస్తున్నారు. అవగాహన లోపంతో అన్నదాతలు ఇలా చేస్తే ఇలాంటి తప్పిదాలతో భూసారానికి ముప్పు పొంచి ఉందని వ్యవసాయశాఖ అధికారులు హెచ్చరిస్తున్నారు. ఇలా చేయడంతో పంట దిగుబడి ఆశించిన స్థాయిలో రాదని చెబుతున్నారు. పంటలకు కీడు చేసే పురుగులను తినే వానపాములు, కీటకాలు నశించే ప్రమాదం ఉంది. భూమికి సేంద్రియ పీచు పదార్థాలుగా ఉపయోగపడే అవశేషాలు ఖనిజ, లవణాలు నశిస్తాయి. వాతావరణ కాలుష్యం ఏర్పడుతుంది.

ఇలా చేస్తే మేలు...

పంటల సాగులో వ్యవసాయ అధికారుల సలహాలు, సూచనలు పాటించాలి. పంటకోత పూర్తయిన తరువాత మిగిలిన పంటల అవశేషాలను భూమిలో మురగబెట్టి దుక్కిలో కలిపిదున్నాలి. ఇలా చేయడంతో వరి గడ్డి భూమిలో మురుగుతుంది. ఆ తరువాత సాగుచేసే పంటకు మేలు చేకూరుతుంది. యూరియా, సూపర్ పాస్పెట్, పొటాష్‌లను కలిపి పంట సాగు చేసుకొనే ముందు చల్లితే పొలంలో మిగిలిన కొయ్యలు, వరి గడ్డి రెండు వారాల్లోనే మురుగుతాయి.

అవగాహన కల్పిస్తున్నాం.



పంట భూముల్లో గడ్డిని, వరి కొయ్యలను దహనం చేస్తే భూసారాన్ని కోల్పోతుంది. అవసరం లేని గడ్డిని భూమిలోనే కలిపి దున్నితే సేంద్రియ ఎరువుగా మారి భూమికి అవసరమైన పోషకాలను అందిస్తుంది. గడ్డి, కొయ్యల దహనంతో వాతావరణ కాలుష్యం అవుతుంది. ఈ విషయంపై రైతులకు అవగాహన కల్పిస్తున్నాం.

– బి.సంధ్య, మండల వ్యవసాయశాఖ అధికారి, హిరమండలం

ఆరోగ్యంపై అవగాహన కల్పించాలి


మాట్లాడుతున్న సీడీపీఓ విమలకుమారి

కొత్తూరు: కిశోరి బాలికలకు అవగాహన కల్పించడం ద్వారానే ఆరోగ్యంగా ఉంటారని స్థానిక సీడీపీఓ విమల కుమారి, బ్రెడ్స్ ఎన్జీఓ ప్రతినిధి జి.జగన్నాథం అన్నారు. కొత్తూరులో అంగన్‌వాడీ కార్యకర్తలు, ఏఎన్‌ఎంలు, మహిళా పోలీస్‌లు, ఆశ వర్కర్లతో బుధవారం సమావేశం నిర్వహించారు. మే 2 నుంచి 10వ తేదీ వరకు కిశోరి బాలికలకు ఆరోగ్యం, బాల్య వివాహాలు, బాల కార్మిక వ్యవస్థతోపాటు పలు అంశాలపై గ్రామ స్థాయిలో అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఆయా గ్రామాల పరిధిలో కమిటీలను ఏర్పాటు చేయాలన్నారు. కమిటీ సభ్యులు కిశోరి బాలికలకు అవగాహన సదస్సులు నిర్వహించాలన్నారు. బాల్య వివాహాల వల్ల కలిగే అనర్థాలు వివరించాలన్నారు. కిశోరి బాలికలు ఆరోగ్యంగా ఉండటానికి తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించాలన్నారు. ఐసీడీఎస్ సూపర్ వైజర్లు, తదితరులు పాల్గొన్నారు.

5న ఇళ్ల పట్టాలపై విచారణ

కొత్తూరు: ఈ నెల 5వ తేదీన మండలంలోని మెట్టూరు బిట్–1 ఆర్‌ఆర్ కాలనీలో అక్రమ ఇళ్ల పట్టాలపై విచారణ చేపడుతున్నట్లు తహసీల్దార్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కాలనీలో పలువురికి అక్రమంగా ఇళ్ల పట్టాలు మంజూరు చేసినట్లు టెక్కలి ఆర్డీఓకు వైఎస్సార్‌సీపీ జిల్లా మాజీ కార్యదర్శి బూర్లె శ్రీనివాసరావు చేసిన ఫిర్యాదు మేరకు విచారణ చేపడతామన్నారు. రౌతు మహాలక్ష్మి, అప్పలనాయుడు, రౌతు రాములు, చిట్టిబాబు, శేషగిరితోపాటు 16 మందిపై శ్రీనివాసరావు టెక్కలి ఆర్డీఓకు ఫిర్యాదు చేశారన్నారు. విచారణకు ఇళ్ల పట్టాలు పొందినవారితోపాటు సంబంధిత అధికారులు, ఫిర్యాదుదారుడు హాజరుకావాలని తహసీల్దార్ నోటీస్‌లు జారీ చేశారు.

ఆర్థికసాయం


నగదును అందజేస్తున్న పట్టుశాలీ సంక్షేమ సంఘం సభ్యులు


ఆర్థిక సాయాన్ని అందజేస్తున్న విశ్వబ్రాహ్మణ సంక్షేమ సేవా సంఘం సభ్యులు

పొందూరు: ఈ నెల 21న సాక్షిలో ప్రచురించిన 'దేవుడి మీదే భారం' అనే శీర్షికకు జాడపేట గ్రామం పట్టుశాలీ సంక్షేమ సంఘం సభ్యులు స్పందించారు. మలకాం గ్రామానికి చెందిన శివాలయం పూజారి తలకు ఆపరేషన్ చేయించుకునేందుకు ఆర్థిక స్తోమత లేకపోవడంతో దాతలను సహాయం చేయాలని కోరారు. ఈ మేరకు పూజారి విబూది నీలకంఠంకు పట్టుశాలీ సంఘం సభ్యులు రూ.20 వేల నగదును బుధవారం అందజేశారు. దున్న మురళి, దండా హరనాథ్, చదువుల విజయమోహన్, తదితరులు పాల్గొన్నారు. అలాగే పొందూరుకు చెందిన కంచి కామాక్షి విశ్వబ్రాహ్మణ సంక్షేమ సేవా సంఘం సభ్యులు అర్చకుని ఇంటికి వెళ్లి రూ.7,100 నగదు, 50 కేజీల బియ్యాన్ని అందజేశారు. సంఘ సభ్యులు కాకినాడ రాజారావు, అరసవిల్లి వెంకటరావు, సింహాద్రి చంటి, తులసీరావు, కాకినాడ శ్రీను, గిడిజాల రమేష్ తదితరులు పాల్గొన్నారు.

నీలమణి అమ్మవారికి ప్రత్యేక పూజలు


హోమం నిర్వహిస్తున్న అర్చకులు

పాతపట్నం: మండల కేంద్రంలోని నీలమణి దుర్గ అమ్మవారికి సహస్ర నామార్చనలు, నీరాజన మంత్ర పుష్పాలతో బుధవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. 50వ వార్షిక మహోత్సవాల్లో భాగంగా రెండో రోజు అమ్మవారికి కుంకుమార్చనలు, హోమాలు నిర్వహించినట్లు ఈఓ వి.వాసుదేవరావు తెలిపారు. తెల్లవారుజామునుంచి ఆంధ్ర, ఒడిశా నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

55 మద్యం సీసాలు స్వాధీనం

ఆమదాలవలస: మండలంలోని ముద్దాడపేటకు చెందిన కంచరాపు నీలంనాయుడు మద్యం అమ్మకాలు చేస్తుండగా బుధవారం శ్రీకాకుళం టాస్క్‌ఫోర్స్ పోలీసులు పట్టుకున్నారు. నీలంనాయుడు ఇంట్లో 55 క్వార్టర్ మద్యం బాటిళ్లు ఉన్నట్లు గుర్తించారు. మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. నీలంనాయుడుని అదుపులోకి తీసుకొని స్థానిక పోలీస్ స్టేషన్‌కు అప్పగించారు. దీనిపై ఎస్‌ఐ బాలరాజు కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ఈ బాటిళ్లు ఏ దుకాణం నుంచి తీసుకువచ్చారన్న కోణంలో దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

పేర్లు నమోదు చేసుకోవాలి


పశువైద్యాధికారి వెంకటరావు

బూర్జ: ప్రభుత్వం పశుసంవర్ధకశాఖ ద్వారా పాడి రైతులకు సబ్సిడీపై అందజేయనున్న పశువుల దాణా కొరకు రైతు భరోసా కేంద్రంలో పశుసంవర్ధక సహాయకుల ద్వారా పేర్లు నమోదు చేసుకోవాలని కొల్లివలస పశువైద్యాధికారి జి.వెంకటరావు అన్నారు. కొల్లివలస పశువైద్య కేంద్రంలో బుధవారం విలేకర్లతో మాట్లాడారు. పాడి రైతులకు 50 శాతం సబ్సిడీపై రూ.555లకు 50 కేజీల బ్యాగ్‌లు అందజేయనున్నట్లు తెలియజేశారు. జనరల్ కేటగిరిపై 120 బ్యాగ్‌లు, ఎస్సీ కేటగిరిపై 33 బ్యాగ్‌లు అందజేయనున్నట్లు తెలిపారు.

ఈదురుగాలుల బీభత్సం

- పలుచోట్ల విరిగిన చెట్లు
- విద్యుత్ సరఫరాకు అంతరాయం
- నేల రాలిన మామిడి కాయలు

నరసన్నపేట:

నరసన్నపేట, ఆమదాలవలస, పాతపట్నం మండలాల్లో మంగళవారం అర్ధ రాత్రి తరువాత ఈదురుగాలులు బీభత్సం సృష్టించాయి. నరసన్నపేట మండలంలోని బాలసీమ కాలనీ రోడ్డుపైన, జల్లువానిపేట–ఉర్లాం గ్రామాల మధ్య గల ప్రధాన రహదారిపైన చెట్లు విరిగిపడ్డాయి. రాకపోకలకు కొంత సమయం ఆటంకం కలిగింది. బాలసీమ కాలనీకి వెళ్లే రోడ్డుపై విరిగిపడిన చెట్లును గ్రామస్తులు తొలగించారు. జమ్ము, తదితర గ్రామాల్లో మామిడికాయలు నేలరాలాయి.

సారవకోట: మండలంలో పలుచోట్ల చెట్లు కొమ్మలు విరిగిపోవడంతో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగింది. బుధవారం ఉదయం ఆయా ప్రాంతాలలో విద్యుత్ శాఖ సిబ్బంది పునర్ నిర్మాణ పనులు చేపట్టారు. సారవకోట, చోడసముద్రం, సింగంవలస, అన్నుపురం, అంగూరు తదితర ప్రాంతాల్లో మామిడి, నువ్వు పంటలకు తీవ్ర నష్టం వాటిల్లింది.


నరసన్నపేట: బాలసీమ వద్ద రోడ్డుకు అడ్డంగా పడిన చెట్టు

బూర్జ: ఈదురుగాలులతో పడిన వర్షానికి పండ్ల తోటలు రైతులు, మామిడి, జీడి, నువ్వు పంట, అరటి రైతులకు నష్టం వాటిల్లింది. శ్రీకాకుళం–పాలకొండ ప్రధాన రహదారిపైన, మదనాపురం–సరుబుజ్జిలి, బూర్జ– మామిడివలస, కొల్లివలస–అన్నంపేటతో పలు రహదారుల్లో చెట్లు విరిగిపడ్డాయి. ఉదయాన్నే చెట్లను తొలగించి ప్రయాణాలు సాగించారు.

ఆమదాలవలస: పట్టణంలోని పోలీస్ స్టేషన్ ఎదురుగా గల కన్వెంక్షన్ హాల్‌కు సంబంధించిన రేకు ఎగిరి రహదారి పైగల విద్యుత్ తీగలపై పడింది. రాత్రి అంతా విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. ఉదయం విద్యుత్ శాఖ సిబ్బంది రేకును తొలగించి విద్యుత్ సరఫరాను పునరుద్ధరించారు.


ఎల్.ఎన్.పేట: రాలిన మామిడికాయలు

మెళియాపుట్టి: ఇప్పటికే పంట దిగుబడి తక్కువగా ఉందని మామిడి రైతు దిగులు చెందుతున్న నేపథ్యంలో అకాల వర్షాలు మామిడి రైతుకు నిద్రలేకుండా చేస్తున్నాయి. మండలంలో పలుచోట్ల మామిడికాయలు నేలరాలాయి. మామిడి రైతులు ఆందోళన చెందుతున్నారు.

ఎల్.ఎన్.పేట: మరికొద్ది రోజుల్లో పంట చేతికి అంది వస్తుందనుకున్న సమయంలో మామిడి కాయలు రాలిపోవటంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. మండలంలోని జంబాడ, సరడాం, బొత్తాడసింగి, దబ్బపాడు, బసవరాజుపేట, మిరియాపల్లి, లక్ష్మీనర్సుపేట తదితర గ్రామాలకు చెందిన మామిడి రైతులకు నష్టం జరిగింది.


బూర్జ: శ్రీకాకుళం-పాలకొండ ప్రధాన రహదారిలో కొల్లివలసవ వద్ద పడిన చెట్లు


ఆమదాలవలస: విద్యుత్ తీగలపై పడిన రేకును తొలగిస్తున్న దృశ్యం


మెళియాపుట్టి: చింతలపోలూరులో రాలిన మామిడి కాయల వద్ద దిగులుగా కూర్చున్న రైతు

చెట్టు నీడలో..


ఆమదాలవలస రైల్వే గూడ్స్ షెడ్, సివిల్ సప్లయ్ గోదాంలో పనిచేసిన కలాసీలకు సీవిల్ సప్లయ్ గోదాం సమీపంలో ఉండే చెట్టే వారికి నీడనిస్తోంది. కలాసీలు తమ కూలీ లెక్కలు వేసుకోవటమే కాకుండా.. ఎవరెవరు ఎక్కడ పనిచేయాలని అన్నది మేస్త్రీలు పంపేందుకు ఈ చెట్టే ప్రధాన కేంద్రం. మండుటెండల్లో ఈ చెట్టు నీడలోనే కలాసీలు సేద తీరుతున్నారు. – ఆమదాలవలస రూరల్

పాఠ్యపుస్తకాలు వచ్చేశాయ్..


హిరమండలం మండల కేంద్రానికి పాఠ్యపుస్తకాలు వచ్చాయని ఎంఈఓ కె.రాంబాబు బుధవారం తెలిపారు. తొలి విడతగా 9,617 పాఠ్యపుస్తకాలు వచ్చాయన్నారు. వీటిని స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన స్టాక్ పాయింట్‌లో భద్రపరిచినట్లు తెలిపారు. – హిరమండలం

ఘనంగా ఆలయ ప్రారంభోత్సవం


ఆలయ ప్రారంభ కార్యక్రమంలో పాల్గొన్న భక్తులు


వేంకటేశ్వర స్వామి విగ్రహం

మెళియాపుట్టి: మండలంలోని పెద్దపద్మాపురంలో నిర్మించిన వేంకటేశ్వర ఆలయ ప్రారంభమహోత్సవం బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో వేకువజామున ప్రత్యేక పూజలు చేశారు. మధ్యాహ్నం భారీ అన్న సంతర్పణ ఏర్పాటు చేశారు. చుట్టు పక్కల గ్రామాల నుంచి వచ్చిన భక్తులందరూ స్వామివారిని దర్శించుకునేలా గ్రామంలోని కమిటీ సభ్యులు సహకరించారు. పలువురు రాజకీయ ప్రముఖులు, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో...


యారబాడులో ఆలయ ప్రారంభ మహోత్సవాల్లో పాల్గొన్న కమిటీ సభ్యులు

నరసన్నపేట: మండలంలోని యారబాడు, దాసరివానిపేటల్లో గ్రామ దేవత నీలమ్మ ఆలయాల ప్రారంభ మహోత్సవాలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఆయా గ్రామస్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. రెండు గ్రామాల్లో అన్నసంతర్పణ కార్యక్రమాలు నిర్వహించారు. యారబాడు సర్పంచ్ రమేష్, ఎంపీటీసీ పాపినాయుడు, మాజీ ఎంపీటీసీ పూతి రమణ, తదితరులు పాల్గొన్నారు.

బాలల హక్కులపై అవగాహన కల్పించండి

పాతపట్నం: మండలంలోని కిశోర బాలికలకు మే 2 నుంచి జూన్ 10వ తేదీ వరకు బాలల హక్కులపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ పి.చంద్రకుమారి అన్నారు. బుధవారం స్థానిక మండల ప్రజా పరిషత్ సమావేశ మందిరంలో ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలోని కిశోర బాలికలపై అంగన్‌వాడీ కార్యకర్తలకు, ఏఎన్‌ఎంలకు అవగాహన కల్పించారు. 15 నుంచి 18 ఏళ్ల బాలికలకు రక్తహీనత, సైబర్ భద్రత, ఆన్‌లైన్ భద్రత, రుతుక్రమ పరిశుభ్రత, లైంగిక దాడులు, లింగ అసమానతలు, బాల్య వివాహాలపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. సూపర్‌వైజర్ అనురాధ, ఈఓ లింగరాజు, వెలుగు సీసీలు, ఏఎన్‌ఎంలు, తదితరులు పాల్గొన్నారు.

రేపటి నుంచి పోలమ్మ మహోత్సవాలు


చింతల పోలమ్మ

పాతపట్నం: ఈ నెల 2 నుంచి 6వ తేదీ వరకు మండలంలోని తెంబూరులో చింతల పోలమ్మ గ్రామ దేవత సంబర మహోత్సవాలు నిర్వహించనున్నట్లు గ్రామ పెద్దలు బుధవారం తెలిపారు. 9 ఏళ్లకు ఒకసారి వచ్చే పోలమ్మ మహోత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. 2వ తేదీన దేవర తెచ్చుట, అమ్మవారి ప్రత్యేక పూజలు, పురవీధుల్లో అమ్మవారి ఊరేగింపు ఉంటాయన్నారు. 3 నుంచి 6వ తేదీ వరకు పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు.

రెట్టింపు వేతనం ఇవ్వాలి

పొందూరు: ప్రపంచ కార్మిక దినోత్సవం మేడేన కార్మికులకు సెలవు దినంగా యాజమాన్యాలు ప్రకటించాలని రాజాం అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్ బి.కొండలరావు తెలిపారు. మేడేతో పనిచేస్తే ఉద్యోగికి రెట్టింపు వేతనం ఇవ్వాలన్నారు. ఉద్యోగి పనిచేసిన రోజుకు మూడు రోజులు ముందు గాని, తరువాత గాని ఒక రోజు జీతంతో కూడిన సెలవు ఇవ్వాలని సూచించారు.